క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం

పాలకొండ రూరల్: పట్టణంలో వెంకటరాయుని కోనేటి గట్టుపై పూర్వపు విద్యార్థులు ఏర్పాటుచేసిన గ్రంథాలయం వద్ద బుధవారం పేదలకు వస్త్రదాన కార్యక్రమం చేపట్టారు. నగర పంచాయతీ పరిధిలో ఎన్‌కే రాజపురం గ్రామానికి చెందిన మిడితాన సూర్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలసి వస్త్రాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా బోనాల పండగ


బోనాలను తీసుకు వెళ్తున్నవారికి పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు సజీవంగా ఉంటున్నాయి. దీనికి ప్రాంతీయభేదాలు లేవు. తెలంగాణలో నిర్వహిస్తున్న బోనాల పండగ ధోరణిలో ఆంధ్రాలో ఒక మారుమూల గ్రామంలో నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. బలిజిపేట మండలంలోని మిర్తివలస గ్రామంలో మూడు తరాల నుంచి సంప్రదాయంగా వస్తున్న బోనాల పండగను సంక్రాంతి పర్వదినాన నిర్వహించారు. ఈ గ్రామంలో తెలగజాతి వారు ఎక్కువగా నివసిస్తారు. వారిలో కుటుంబాల పరంగా గన్ను, గునపర్తి, మానం, శిగురుకోట, గంగు, గుండాపు వారు ఉన్నారు. వీరు కుటుంబాల పరంగా పేరంటాలను కొలుస్తారు. కానీ అందరికీ ఆరాధ్య దైవంగా ఉన్న ఎంకమ్మ పేరంటాలను భక్తిప్రపత్తులతో కొలుస్తారు. 5కుండలకు పసుపు, కుంకుమలు రాసి బొట్లు పెట్టి పూలతో అలంకరించి బోనాలుగా పిలుస్తారు. కుటుంబాలపరంగా వారివారి ఇళ్లలో వాటిని ఉంచి 5కుండలలో కలగాయకూర, పరమాణ్ణం, మైదాపిండి అట్లు, అరిసెలు, అంటిపండ్లు వేసి బోనాలను పూజించి వారి ఇళ్లనుంచి బయల్దేరి గ్రామం శివారున ఉన్న ఎంకమ్మపేరంటాలి గుడి వద్దకు వెళ్లి భక్తి ప్రపత్తులతో మొక్కి పూజలు చేశారు. బోనాలతో ఇంటినుంచి బయలుదేరేటపుడు ఇంటియజమానురాలు తలపై బోనాలను పెట్టుకోగా భర్త సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి అనుసరించాడు. బోనాలతో నడిచేవారి కాళ్ల కింద బట్టలు వేసి వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అటు వంటపుడు ఆ దంపతుల కాళ్ళు తాకుతూ వారిపై నుంచి దాటివెళ్తే ఎంతో పుణ్యమని భావించిన వారు నేలపై పడుకుని వారి ఆశీస్సులు పొందారు. వారిని దాటుకుంటూ బోనాలను దంపతులు గుడికి చేర్చారు. అక్కడ అందరూ కలిసి ఎంకమ్మపేరంటాలను మొక్కుకుని బోనాలలో ఉంచిన ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు. అక్కడే అన్నం, సాంబారుతో భోజనాలు చేసి వారి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుభకార్యాలు చేసేవారు ముందుగా పేరంటాలను కొలిచిన తరువాతే శుభకార్యాలు జరిపిస్తారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన పోలమాంబ అమ్మవారి ఆలయం


శంబర పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు బుధవారం పోటెత్తారు. ఈనెల13వతేదిన అమ్మవారు చదురుగుడికి చేరుకుని, ఆలయంలో కొలువై ఉన్నారు. మంగళవారం కాళ్ల నొప్పుల కారణంగా, విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగకు వారి వారి గ్రామాలుకు చేరుకున్నారు. తిరిగి వారు నివాసముంటున్న ప్రాంతాలకు వెళ్లే ముందు పోలమాంబ అమ్మవారిని దర్శించుకుందామన్న ఆశతో భక్తులు తరలివచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.


గరుగుబిల్లిలో హరిదాసు సంకీర్తనలు


సీతంపేట: ఇళ్ల ముంగిట రంగవల్లికలు వేస్తున్న మహిళలు


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో గ్రామ దేవతకు మొక్కులు చెల్లిస్తున్న నాలుగు తరాల కుటుంబీకులు

వేడుకగా సంక్రాంతి... కనుల పండువగా కనుమ

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి, కనుమ పండగలు మంగళ, బుధవారాల్లో సందడిగా జరిగాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సరదగా సందడి చేశారు. ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు చేశారు. కనుమ రోజు పశువులను పూజించారు. కొత్త దుస్తులు ధరించి అంతా సందడిగా గడిపారు. ఏడాదికొకసారి వచ్చే పండగలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధుగణంతో పల్లెలు కలకలలాడాయి. – సాక్షి నెట్‌వర్క్‌


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు


కొమరాడ: పరుశురాంపురంలో క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత


భామిని: పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు

ఫారెస్ట్ రేంజ్ అధికారికి సన్మానం

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల పాఠశాలలో చదువుకుని నేడు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉద్యోగం సాధించిన కె.మణికృష్ణను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కోయంబత్తూరులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చిన మణికృష్ణను సంక్రాంతి సందర్భంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధించవచ్చునని మణికృష్ణ రుజువు చేసారని గ్రామ సర్పంచ్ డోకల సుజాతాశ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దేవరపల్లి కృష్ణ,మజ్జి నాగభూషణరావు, పద్మావతి మేడమ్, శ్రీబాబు మాష్టారు తదితరులు మణికృష్ణను దుశ్శాలవులతో సత్కరించారు.


మణికృష్ణను సన్మానిస్తున్న నడిమికెల్ల గ్రామస్తులు

కోడి రామ్మూర్తి జీవితం ఆదర్శం

- బౌద్ధ బిక్షువు బోధిహీన్

వీరఘట్టం: కళియుగ భీముడు, ఇండియన్ హెర్క్యులెస్, మల్లమార్తాండ కోడి రామ్మూర్తినాయుడు జీవితం ఎందరికో ఆదర్శమని బౌద్ధ భిక్షువు భోధిహీన్ అన్నారు. శ్రీలంక నుంచి వీరఘట్టం వచ్చిన ఆయన వీరఘట్టం తెలగవీధిలో ఉన్న కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్మూర్తినాయుడు జన్మించిన ఇంటిని, తిరిగాడిన ప్రదేశాలను సందర్శించారు. ఇటువంటి మహానుభావునికి నివాళులు అర్పించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద, బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న రామ్మూర్తినాయుడు విగ్రహాలను సందర్శించారు. ఆయనతో పాటు స్థానికులు ఇట్లా మన్మధరావు, దొలూరు సత్యారావు, కోడి తాతబాబు, బల్లా హరిబాబు తదితరులున్నారు.


తెలగవీధిలో ఉన్న కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి పూలమాల వేస్తున్న బోధిహీన్

సిరులు కురిపిస్తున్న ఉసిరి

- సీతాకాలంలోనే పంట దిగుబడి
- విలువైన పోషకాలు కలిగే ఉసిరి

బొబ్బిలి రూరల్: కార్తీక మాసం నుంచి శీతాకాలం చివరి వరకు దొరికే అరుదైన ఫలం ఉసిరి. సి విటమిన్ నిండుగా ఉన్న ఉసిరికి కాయలో ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయని మన పెద్దలతో పాటు పురాణాలు, ఆయుర్వేద గ్రంథాల్లో దీని ప్రాముఖ్యతను వివరిస్తు ఎన్నో కథలు ఉన్నాయి. నేటి శాస్త్రవేత్తలు సైతం వైద్య రంగంలో ఉసిరిలో దాగి ఉన్న పోషకాలపై ఎన్నో పరిశోధనల ద్వారా మనకు తెలియజేస్తున్నారు. దీంతో నేడు ప్రస్తుతం ఉసిరి పంట రైతులకు సిరులు కురుపిస్తోంది. కేజీ ఉసిరి కాయలు 150 రూపాయిల వరకు బహిరంగ మార్కెట్లో ధర పలుకుతుండగా అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న ఉసిరి కాయలు నేడు మార్కెట్లో లభ్యం కావడంతో వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. చిన్న వయసులోనే నెరిసిపోతున్న తల నీలాలకు, దగ్గు, జలుబు వంటి జబ్బులకు ప్రాధమికంగా వాడే దివ్య ఔషధంగా వాడే ఉసిరి నేడు పట్టణ వాసులకు అందుబాటులో దొరుకుతోంది. బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వీటిని దిగుబడి చేసుకుంటున్న చిరు వ్యాపారులు వీటి అమ్మకాలతో మంచి ఆదాయం ఆర్జిస్తూ సంబరపడుతున్నారు.


మార్కెట్లో లభ్యమవుతున్న ఉసిరి

కాల్చితే కాలుష్యం.. దున్నితే సారవంతం!

- వరిగడ్డిని కాల్చడంతో భూమిలో తేమశాతం తగ్గుదల
- కలియ దున్నడంవల్ల సారం, దిగుబడి పెరుగుతుందంటున్న నిపుణులు


వరి దుబ్బులను కాల్చుతున్న రైతులు

గరుగుబిల్లి: యంత్రాలతో వరి పంటను కోసిన తరువాత పొలంలో మిగిలిన వరి దుబ్బులు, కోత యంత్రాల నుంచి వచ్చిన ఎండుగడ్డిని రైతులు కాల్చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పొలంలో చేరిన నష్టపరిచే సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు నాశనం అవుతాయని రైతులు భావిస్తున్నారు. ఇలా చేయడంవల్ల వాయుకాలుష్యం పెరిగి, పర్యావరణం దెబ్బతినడంతో పాటు భూసారాన్ని పెంచే సూక్ష్మజీవులు, కీటకాలు కూడా నాశనం అవుతున్నాయన్న విషయాన్ని రైతులు గ్రహించలేకపోతున్నారని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పొలంలోని వరిదుబ్బులతో పాటు, కోత యంత్రాలతో కిందపడిన ఎండుగడ్డిని భూమిలో కలియ దున్నితే భూసారం పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పశువులకు గ్రాసం దొరకడంతో పాటు భూమికి సారం పెరుగుతుందని పేర్కొంటున్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన యాంత్రీకరణ కారణంగా ప్రస్తుతం కోత యంత్రాలతో 30 సెంటీమీటర్ల ఎత్తులో వరిదుబ్బులు కోత చేస్తున్నారు. దీంతో 50 శాతం గడ్డి వరిదుబ్బులు అవశేషాల రూపంలో వృథాగా వుండిపోతున్నాయి. ఫలితంగా ఎకరానికి రెండు టన్నుల వరకు వరిదుబ్బులు, గడ్డి నాశనం అవుతున్నాయి. అలాగే ఒక టన్ను వ్యర్థాలు కాల్చితే 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు 1400 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ గాలిలోకి విడుదలవుతుంది. ఇదే కాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడంతో వాయుకాలుష్యం పెరిగి, భూసారం తగ్గుతుంది. నేల పొరల్లో తేమశాతం ఆవిరై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కలియదున్నడంతో ప్రయోజనాలు

టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 11 కిలోల భాస్వరం, 18.9 కిలోల పొటాష్, కొద్ది మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరమవుతాయి. అందువల్ల వరి దుబ్బులను కలియదున్నడంతో పోషకాలన్నీ నేలకు చేరుతాయి. లేకుంటే పంట వ్యర్థాలను ముడిపదార్థాలుగా వాడుకొని కంపోస్టు పద్ధతిలో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. వరిపంట కోసిన వెంటనే మిగిలిన తేమను ఉపయోగించుకోవడంతో దుబ్బులు భూమిలో కలిసిపోయి క్రమేణా కుళ్లిపోతాయి. నాట్లు వేయడానికి ముందు దమ్ము చేసేటప్పుడు ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేసి, కలియదున్నడంవల్ల పరిదుబ్బులు వేగంగా కుళ్లి సేంద్రీయ ఎరువుగా తయారవుతుంది. వరిదుబ్బులను నేలలో కలియ దున్నడంతో సేంద్రియ కార్బన్ శాతం పెరగడమే కాకుండా పంట దిగుబడి 8 శాతం నుంచి 10 శాతం వరకు పెరుగుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియ కారణంగా భూమిలో సేంద్రియ పదార్థాలు మెరుగుపడి, పోషకాలు లభ్యత మెరుగుపడతాయి.

కలియ దున్నుకోవాలి..



వరిదుబ్బులు, కోత మిషన్‌లో కోసిన వరిగడ్డికి నిప్పు పెడుతుంటారు. ఇది పర్యావరణానికి అత్యంత ముప్పు. ఇలా చేయడంవల్ల నేల పొరల్లో తేమశాతం తగ్గి, పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరిదుబ్బులతో ఎండుగడ్డిని కాల్చకుండా కలియదున్నాలి. ఇందులో వున్న పోషకాలన్నీ భూమిని చేరి, పంట శాతం పెంచడంలో తోడ్పడతాయి. పొలాల్లో వరిదుబ్బులను కాల్చడంతో పర్యావరణానికి తీవ్ర నష్టంతో పాటు పశువులకు మేత కొరత ఏర్పడుతోంది. కోత యంత్రాలతో వచ్చిన వరిగడ్డిని తగలబెట్టకుండా పొలాల్లోనే విడిచి పెట్టడంతో పశువులకు మేతతో పాటు పొలానికి సారం వస్తుంది.

– ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు .సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చిన వీరంతా హైస్కూల్ ప్రాంగణంలో ఇలా కలుసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. సుమారు 36 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం చెప్పలేని ఆనందాన్ని ఇచ్చిందని వారన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

వీరఘట్టం: మకర సంక్రాంతిని పురష్కరించుకుని స్థానిక శాస్తా సమాజంలో అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. శబరిమలలో మకర సంక్రాంతి రోజు అనగా మంగళవారం జ్యోతి దర్శనం ఇచ్చే సమయంలో వీరఘట్టంలో అదే సమయంలో స్వామి వారికి పూజలు చేసి శరణుఘోష చేసారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భరత్‌స్వామి, బుక్కూరు దుర్గారావు, అంబళ్ల గోపి, పాట్నూరు కోటి, తెంటు వెంకటరమణ, సీరాపు నాగరాజు, కర్రి తిరుపతిరావు, ఇట్లా శ్రీనివాసరావు, శంకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.


మకర జ్యోతి దర్శనం వేళ పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

పర్యాటకుల సందడి


సవరకోటపాడు కల్చరల్ అండ్ అడ్వంచర్ పార్క్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

సంక్రాంతి నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని పర్యాటక ప్రదేశాలైన తాడికొండ మొగనాళి గెడ్డ జలపాతంతో పాటు సవరకోటపాడులో గల కల్చరల్ అండ్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి బుధవారం నెలకొంది. సుదూర ప్రాంతాలతో పాటు స్థానికంగా విచ్చేసిన పర్యాటకులు పెద్దలు మొదలుకొని పిన్నల వరకు కుటుంబాలతో కలసి వీక్షిస్తూ సరదాగా గడిపారు. జలపాతంతో పాటు బోటు షికారు చేస్తూ కేరింతలతో ఆనందాన్ని పంచుకున్నారు. సంక్రాంతి సందర్భంలో పిల్లాపాపలతో సరదాగా గడపడానికి కుటుంబాలతో పెద్దమొత్తంలో పర్యాటకులు విచ్చేయడంతో పర్యాటక ప్రదేశాలన్నీ కలకలలాడాయి. – గుమ్మలక్ష్మీపురం


సవరకోటపాడులోని చిన్నారుల పార్క్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు


తాడికొండ మొగనాళి గెడ్డలో పర్యాటకుల సందడి